నేడు డయల్ యువర్ డీఎం

మియాపూర్ : ఆర్టీసీ మియాపూర్‌- 1డిపో పరిధిలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ మోహన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. మియాపూర్‌-1 డిపో పరిధిలో తిరుపతి, విశాఖపట్నం, గుంటూరు, బెంగుళూర్, భద్రాచలం, విజయవాడ, ఒంగోలు, కడప, అనంతపురం, తాడిపత్రి ప్రాంతాలకు వెళ్లి వచ్చే ప్రయాణికులు ఈ సర్వీస్‌లపై సమస్యలు, సూచనలు, సలహాలను మేనేజర్ నంబర్ 9959226153కు మంగళవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు తెలియజేయాలని సూచించారు. ఈ డిపో నుండి బస్ ఆన్ కాంట్రాక్ట్ పద్ధతిన తీర్థయాత్రలకు, వివాహాది శుభ కార్యాలకు సూపర్ లగ్జరీ, రాజధాని, లహరి బస్సులను అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చందానగర్ డీఐగా భాస్కర్



చందానగర్: చందానగర్ పోలీస్‌స్టేషన్ నూతన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా భాస్కర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మల్టీజోన్ -2లో ఇన్‌స్పెక్టర్‌గా పని చేసి బదిలీపై సైబరాబాద్ కమిషనరేట్‌కు వచ్చారు. చందానగర్ డీఐగా పని చేసిన రవికుమార్ బాలానగర్ జోన్ సీసీఎస్‌కు బదిలీపై వెళ్ళారు.

సమాచారం

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వేస్టేషన్ నుంచి దూర ప్రాంతాలకు బయలుదేరు రైళ్ల వివరాలు..

(సోమ, బుధ, శుక్ర)

- 4.40 అమరావతి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి-విజయవాడ
- 6.15 జన్మభూమి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి- వైజాగ్
- 12.25 దేవగిరి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి-సీఎస్‌ఎంటీ (ముంబాయి)
- 17.30 నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి-తిరుపతి
- 18.25 కోకనాడ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి - కాకినాడ

(మంగళ, గురు, శని)

- 20.30 గౌతమి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి-కాకినాడ
- 21.00 నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి-నర్సాపూర్
- 22.05 హంసఫర్ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి-ఇండోర్ (ఆదివారం)

ముగిసిన డప్పు శిక్షణ తరగతులు

మాదాపూర్: మాదాపూర్‌లోని తెలంగాణ సాంస్కృతిక సారథి ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్న డప్పు శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి అధ్యక్షురాలు డాక్టర్ జీ.వి వెన్నెల మాట్లాడుతూ తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన 60 మంది కళాకారులు ఈ శిక్షణలో పాల్గొన్నట్టు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడానికి శిక్షణ శిబిరాన్ని నిర్వహించినట్టు తెలిపారు.



గచ్చిబౌలిలోని నిథమ్ అకడమిక్ బ్లాక్ భవనం ఇదే



'నిథమ్'కు మంచిరోజులు వచ్చేనా?

నూతన డైరెక్టర్‌గా ప్రొఫెసర్ వి.వెంకటరమణ నియామకం

బోధన..పాలనలో ఆయనకు దశాబ్దాల అనుభవం

రాయదుర్గం: పర్యాటక, ఆతిథ్య కేంద్రంగా, విద్య, శిక్షణలో జాతీయ సంస్థగా గుర్తింపు పొందిన గచ్చిబౌలిలోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్)కు మళ్లీ మంచిరోజులు వచ్చేనా అన్న చర్చ జరుగుతోంది. బోధన, పాలనారంగంలో దశాబ్దాల చరిత్ర కలిగిన హెచ్‌సీయూ సీనియర్ ప్రొఫెసర్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్, ఆర్‌జీకేయూటీ వీసీగా పనిచేసిన ప్రొఫెసర్ వి.వెంకటరమణను డైరెక్టర్‌గా నియమించింది. తన అనుభవంతో నిథమ్‌కు పూర్వ వైభవం తీసుకొస్తారని ఆ దిశగా తగిన చర్యలు తీసుకుంటారని అందరూ ఎదురుచూస్తున్నారు.



గచ్చిబౌలిలోని నిథమ్ ప్రధాన ద్వారం

డైరెక్టర్‌గారూ వీటిపై దృష్టి పెట్టండి
'నిథమ్'లో నెలకొన్న సమస్యలు ఇవే..

- 'నిథమ్'కు యూనివర్సిటీ హోదా రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఇదే అతి ప్రధానమైన సమస్యగా చెప్పవచ్చు.
- ఫ్యాకల్టీ, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది జీతభత్యాల పెంపు, ఇంక్రిమెంట్లు, డీఏలు, ఇతర ఆర్థిక సమస్యలు తీర్చడం, పదోన్నతులు కల్పించాలి.
- 'నిథమ్'లో కొత్త కోర్సులు, స్వల్పకాలిక కోర్సులను ప్రవేశ పెట్టాలి. విద్యార్థుల సంఖ్య పెంపుపై దృష్టి సారించాలి.
- క్యాంపస్‌లో విద్యార్థులకు మరిన్న అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులోకి తేవడంతో బాటు ఆహ్లాదం, పచ్చదనం పెంపొందించాలి.
- ఆగిన భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి.
- 'నిథమ్'కు పూర్తి స్థాయి ప్రిన్సిపాల్, ఇతర అధికారులను నియమించాలి.
- క్యాంపస్‌లో దశాబ్దాలుగా కొనసాగే మట్టి, బండరాళ్లతో కూడిన గుట్టపై రూ. రెండున్నరకోట్లతో ఏర్పాటు చేసిన రాతి శిల్పాలను ప్రజలంతా తిలకించే అవకాశం కల్పించాలి.
- రామమ్మకుంట సుందరీకరణ, ఫౌంటిన్ల ఏర్పాటు, కుంటకట్టపై వాకింగ్ ట్రాక్, గ్రీనరీ, నక్షత్రాల, రాశుల చెట్ల పెంచాలి.
- ఫ్యాకల్టీ, ఉద్యోగులు, సిబ్బందికి క్వార్టర్స్ నిర్మాణ ప్రతిపాదనను అమలులోకి తీసుకురావాలి.
- ఆంపీ థియేటర్, కాఫీ హబ్, క్రికెట్ స్టేడియం ద్వారా మరింత ఆదాయం సమకూర్చుకునే దిశగా అడుగులు వేయాలి.



ప్రొఫెసర్ వి.వెంకటరమణ

ప్రజావాణి..7 ఫిర్యాదులు

చందానగర్ : చందానగర్ సర్కిల్- 21 కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 7 ఫిర్యాదులు వచ్చాయని ఉప కమిషనర్ శశిరేఖ తెలిపారు. టౌన్‌ప్లానింగ్ 4, శానిటేషన్ 1, రెవెన్యూ 2 ఫిర్యాదులు రాగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను డీసీ ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీ నాగిరెడ్డి, ఇంజనీరింగ్ డీఈ దుర్గాప్రసాద్, శానిటేషన్, యూబీడీ అధికారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో ప్రజావాణి కార్యక్రమంలో ఆరు ఫిర్యాదులు అందాయి. టౌన్ ప్లానింగ్ 2, శానిటేషన్, ఇంజనీరింగ్, అర్బన్ బయోడైవర్సిటీ విభాగాలకు ఒక్కొక్క ఫిర్యాదు వచ్చినట్లు అధికారులు వివరించారు.



చందానగర్ సర్కిల్ ప్రజావాణిలో సమస్యలు వింటున్న డీసీ శశిరేఖ

14 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రైవ్‌లో 14 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఐదుగురికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమాన, మరో తొమ్మిది మందికి రూ. 1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ

మియాపూర్ : మహిళా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. మియాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ మైనార్టీ మహిళాశక్తి పథకం, రేవంత్ అన్న భరోసా కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రం, మైనార్టీ కార్పొరేషన సంస్థ ద్వారా 9 మందికి క్రిష్టియన్, మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్లను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలకు స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథ్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, నరేందర్ బల్లా, శివ ముదిరాజ్, నరేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

సమస్యలు పరిష్కరించాలని వినతి



కార్పొరేటర్ రోజాదేవికి వినతిపత్రం అందజేసిన అసోసియేషన్ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్‌లోని కమల ప్రసన్ననగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శేఖర్ కాలనీ సభ్యులతో కలిసి కాలనీలోని సమస్యలపై డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవికి సోమవారం వినతిపత్రం అందజేసి సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. దీనిపై కార్పొరేటర్ స్పందిస్తూ, వీలైనంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

నేడు నూతన రేషన్ కార్డులు పంపిణీ

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గంలో ఈనెల 29వ తేదీ నూతన రేషన్ కార్డుల పంపిణీని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో నూతన రేషన్‌కార్డుల పంపిణీపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్వరూప, ఆయా మండలాల తహసీల్దారులు, రేషన్ డీలర్ల ప్రతినిధులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గ పరిధిలో నూతన రేషన్ కార్డుల కోసం 9,414 దరఖాస్తులు రాగా.. అర్హులైన 2,096 దరఖాస్తులు ఆమోదించినట్లు తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గం వ్యాప్తంగా 74,214 రేషన్ కార్డులు వినియోగంలో ఉన్నాయని తెలిపారు. రేషన్ కార్డు మంజూరైన ప్రతి లబ్ధిదారుడు సమావేశానికి హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజా, ఆయా మండలాల తహసీల్దార్‌లు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ఫుడ్ సేఫ్టీపై శిక్షణ

చందానగర్ : శేరిలింగంపల్లి, చందానగర్ జంట సర్కిళ్ల పరిధిలో నేషనల్ అసోసియేషన్ ఫర్ స్ట్రీట్ వెండర్స్ (ఎన్‌ఏఎస్‌వీఐ) ఆధ్వర్యంలో ఫుడ్‌సేఫ్టీ, స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) సహకారంతో ఆహార పదార్థాల తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీధి వ్యాపారులకు సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ శశిరేఖ మాట్లాడుతూ వీధి వ్యాపారులు ఆహార పదార్థాలు తయారు చేసే ప్రదేశం, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పోషకాలు నష్టపోకుండా వండేటట్లు చూడడం, ఫుడ్ కలర్స్ వాడకుండా ఉండడం, ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేయడం తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారి హృదయ, యూసీడీ, ప్రాజెక్టు ఆఫీసర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



అంబేద్కర్ కల్యాణ మండపంలో శిక్షణ కార్యక్రమంలో డీసీ శశిరేఖ

పర్యావరణ సమతుల్యత అవసరం

హెచ్‌సీయూ ప్రొ. కిషోర్‌కుమార్



శారదా స్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌సీయూ ప్రొఫెసర్ కిషోర్

రాయదుర్గం: జీవరాశుల మనుగడకు మూలాధారం పంచభూతాలేనని హెచ్‌సీయూలోని సెంటర్ ఫర్ ఎర్త్, స్పేస్ సైన్స్ అండ్ ఓషన్ ప్రొఫెసర్ జి కిషోర్‌కుమార్ పేర్కొన్నారు. ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండాపూర్‌లోని శారదా ఉన్నత పాఠశాలలో సోమవారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రకృతి, పర్యావరణ సమతుల్యత మానవ మనుగడకు అవసరమన్నారు. ఆధునికీకరణ, పారిశ్రామికీకరణ, పట్టణీకరణ వల్ల సంభవిస్తున్న పరిణామాలు ప్రకృతి విధ్వంసం దిశగా కొనసాగడం శోచనీయమన్నారు. ప్రకృతిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బందా నరేంద్రబాబు, అసోసియేషన్ సభ్యులు పాలం శ్రీనివాస్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మొండికత్వా ప్రాంతానికొస్తే చర్యలు

- అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తాం
- రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో

రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లి జన చైతన్య వెంచర్ ప్రాంతంలోని మొండికత్వా వద్ద ఫొటోలు దిగేందుకు, రీల్స్ చేసేందుకు, చేపలు పట్టేందుకు ఎవరు వచ్చినా వారిపై కేసులను నమోదు చేస్తామని రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో హెచ్చరించారు. హిమాయత్‌సాగర్ నుంచి కిస్మత్‌పూర్ మీదుగా లంగర్‌హౌజ్ బాపూఘట్‌లోని మూసీ నదిలోకి వరదనీరు చేరేందుకు గతంలో ఈ కాలువను నిర్మించారు. హిమాయత్‌సాగర్ నిండితే గేట్ల ద్వారా నీటిని ఈ కాలువ గుండా మూసీలోకి వదులుతారు. జన చైతన్య వెంచర్‌తో పాటు కిస్మత్‌పూర్ ప్రాంతంలో రెండు కత్వాలను నిర్మించారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో ఈ కత్వాల పైనుంచి నీరు జాలువారుతుంది. దీన్ని చూసేందుకు నగరం నలుమూలల నుంచి పలువురు యువకులు ఈ ప్రాంతానికి వస్తుంటారు. హిమాయత్‌సాగర్ వరద గేట్లు తెరిచిన ప్రతిసారి ఈ ప్రాంతంలో సందడి నెలకొంటుంది. గడచిన మూడు సంవత్సరాల్లో ఈ ప్రాంతంలో నలుగురు యువకులు మృత్యువాత పడ్డారు. దీంతో రాజేంద్రనగర్ పోలీసులు ఈ ప్రాంతానికి వెళ్లకుండా కంచెను ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. గతంలో యువకులు ఈ ప్రాంతానికి వచ్చిన సమయంలో ఫొటోలు, రీల్స్ తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రస్తుతం ఈ క్లిప్పింగ్‌లు యూట్యూబ్‌లో అలాగే ఉన్నాయి. జగద్గిరిగుట్టకు చెందిన అక్షిత్ రెడ్డి స్నేహితుల బృందం ఆదివారం నగరంలో సమీపంలో వాటర్ ఫాల్స్ అని సెర్చ్ చేయగానే ఈ మొండికత్వా ఫొటోలు, రీల్స్ రావడంతో ఇక్కడికి వచ్చాడు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో రాజేంద్రనగర్ పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. యువకులు ఎవరైనా ఈ ప్రాంతానికి వస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మొండికత్వా ప్రమాదభరితంగా ఉందని... నీళ్ల అలుగుపై నుంచి పారుతుండటంతో పాకుడు పట్టిపోయిందన్నారు. దీని గుండా ప్రయాణించే సమయంలో జారి నీటి గుంతల్లో పడే అవకాశం ఉందన్నారు. కత్వా కింది భాగంలో లోతైన గుంతలు ఉన్నాయని.. రాళ్లు, రప్పలతో ఉండటంతో పాటు బురద పేరుకుపోయిందన్నారు. ఈత వచ్చినా.. బురదలో కూరుకుపోతే ప్రమాదం ఉందన్నారు. యువకులు, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి ఈ ప్రాంతానికి రావద్దని హెచ్చరించారు.

కబ్జా కోరల్లో ఫిరంగి నాలా

- నాలా చుట్టూ ప్రహరీల నిర్మాణం
- తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్న ఇరిగేషన్ అధికారులు
- కాలువను పునరుద్ధరించకపోవడంతో కబ్జాలకు ఊతం

శంషాబాద్: ఫిరంగి నాలా కబ్జాదారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. నాలా పక్కన భూములు కొన్న యజమానులు నాలాను ఆక్రమిస్తున్నారు. ఎయిర్‌పోర్టు ప్రధాన రహదారికి అత్యంత సమీపంలో ఆక్రమణల పర్వాన్ని కొనసాగిస్తున్నారు. కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కి ఉనికి కోల్పోతున్న నాలాను పరిరక్షించడంలో ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వీరికి వరంగా మారుతోందని విమర్శలు వెలువడుతున్నాయి.

శంషాబాద్ పట్టణంలో...

శంషాబాద్ పట్టణంలో జాతీయ రహదారికి పక్కనే ఎయిర్‌పోర్టు ప్రధాన రహదారిని ఆనుకున్న సర్వే నంబర్లు 182, 275 మధ్యలో ఫిరంగి నాలా ఉంది. ఇది పూర్తిగా చదునుగా ఉండటంతో నాలా ఉందనే విషయం కూడా కనిపించని పరిస్థితి. ఇటీవల ఇక్కడ భూములు కొనుగోలు చేసిన కొందరు యజమానులు నాలాకు రెండు వైపుల తమ భూములు ఉండటంతో చుట్టూ ప్రీకాస్ట్‌తో ప్రహరీని నిర్మించారు. మధ్యలో ఉన్న నాలాను పూర్తిగా తవ్వించాలని ఇటీవల స్థానికులు ఇరిగేషన్ అధికారులకు విన్నవించారు.

నాలాను తవ్వితేనే...

ఏడాదిన్నర క్రితం ఇక్కడే కొందరు నాలాకు ఇరువైపులా ఉన్న గోడను సైతం తొలగించి మట్టితో చదును చేశారు.ఈ నాలాకు ఇరువైపులా కొందరు రియల్టర్లు పదిహేను ఎకరాలకు పైగా ఇక్కడ భూములు కొనుగోలు చేశారు. భూమి చదునుగా ఉండటంతో నాలాను కలుపుకోవాలనే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. దీనిపై ఇరిగేషన్ అధికారులు సత్వరమే చర్యలు తీసుకుని నాలా విస్తరణతో పాటు హద్దులు గుర్తిస్తేనే సమస్య పరిష్కారమవుతుందని,అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

మధ్యలో ఫిరంగి నాలా.. చుట్టూ ప్రహరీ నిర్మాణం



అధికారుల అలసత్వంతోనే..



అధికారుల అలసత్వం కారణంగానే పట్టణంలో ఫిరంగి నాలా ఆక్రమణలకు గురవుతోంది. ప్రీకాస్ట్ తొలగిస్తే సమస్య పరిష్కారం కాదు. ఇరిగేషన్ మ్యాపులో ఉన్న విధంగా నాలాను పునరుద్ధరించి బఫర్ జోన్ వరకు హద్దులు ఏర్పాటు చేస్తే నాలా పరిరక్షణ సాధ్యమవుతుంది. ఎయిర్‌పోర్టు రహదారి పక్కనున్న నాలాను అక్రమార్కులు తరచు కబ్జాలకు పాల్పడుతున్నారు.

– మురళి, శంషాబాద్

చర్యలు తీసుకుంటాం

నాలా పునరుద్ధరణ కోసం ప్రత్యేకంగా బడ్జెట్ పెట్టి చేయాల్సి ఉంటుంది. మధ్యలో నాలా ఉండి చుట్టుపక్కల నిర్మాణాలు చేపడితే తొలగిస్తున్నాం. ఇటీవల ప్రీకాస్ట్ వేసిన వాటిని కూడా తీయించాల్సిందిగా ఆదేశించాం. శాశ్వత నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకుంటాం.

– మౌనిక, ఏఈ, ఇరిగేషన్

ఎస్‌టీపీ పైప్‌లైన్ పునరుద్ధరణ పనుల పరిశీలన

మియాపూర్ : మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తానని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్ కాలనీ నుండి శాంతినగర్ కాలనీ రోడ్డులో ఎస్‌టీపీ పైప్‌లైన్ పునరుద్ధరణ పనులను జలమండలి అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఔట్‌లెట్ సరిగ్గా లేకపోవడంతో తరచూ సమస్య తలెత్తుతుందని, త్వరలోనే సమస్య పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథ్‌రెడ్డి, జీఎం సత్యనారాయణ, డీజీఎం భార్గవి, మేనేజర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులపై కేసులు

శంషాబాద్: ఆర్‌జీఐఏ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల నమోదైన 33 కేసుల్లో ఒకరి జైలు శిక్షతో పాటు మిగతా వారిని నుంచి జరిమానా వసూలు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిలో ఓ వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష, రూ. 2 వేల జరిమానాను కోర్టు విధించిందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 17 మంది నుంచి రూ. 50 వేలు జరిమానా, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారి నుంచి రూ. 32 వేల జరిమానా వసూలు చేశారమన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఉల్లంఘనులపై చట్టపరమైన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

కమ్యూనిటీహాల్ ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా సాగుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం రామచంద్రాపురం డివిజన్‌లోని 5వబ్లాక్ లోని పోచమ్మ ఆలయ ప్రాంగణంలో రూ.కోటి 30 లక్షల నిధులతో నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాలు, పట్టణాలను ప్రభుత్వం, సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కార్పొరేటర్ బి.పుష్ప, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మురుగు సమస్య.. తీరేదెన్నడు..?











మాధవినగర్, గోవింద్ హోటల్ చౌరస్తావద్ద రోడ్డుపై పారుతున్న వరద నీరు

ఆల్విన్‌కాలనీ: వర్షం తగ్గినా వరద సమస్య తీరడం లేదంటూ స్థానికులు వాపోతున్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉషా ముళ్లపూడి రోడ్డు గుంతలమయంగా మారింది. మ్యాన్‌హోల్స్ కుంగిపోయి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పొడవడంతో రోజు మురుగు నీరు రోడ్లపై పారుతోంది. మురుగు సమస్యతో దుర్వాసన, దోమల బెడద పెరిగిపోయింది. వర్షపునీరుతో మురుగు పారుతుండడంతో రాకపోకలకు అవస్థ పడుతున్నారు. ఈ మురుగు నీటి పైప్‌లైన్ పక్కనే మంచినీటి పైపులైన్ ఉంది. అది కూడా లీకేజీలు ఏర్పడుతుండడంతో ప్రజలు భయపడుతున్నారు. మురుగునీటి సమస్య ఫిర్యాదులు రాగానే జీహెచ్‌యంసి సిబ్బంది అందులో వ్యర్థాలను తొలగించి రోడ్డుపై వేస్తారని, సాయంత్రానికి మళ్లీ పొంగిపొర్లుతోందని శాశ్వత పరిష్కారం చూపించాలని స్థానికులు కోరుతున్నారు.

గుంతలమయం



గుంతల రోడ్డులో ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయపడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ప్రజాప్రతినిధులు ఈ ప్రాంతంలో పలుమార్లు పర్యటించారు. ఈ సమస్యను పరిష్కరించాలి.

–రాంమోహన్‌రావు, మాధవినగర్ కాలనీవాసి